

- నేడు మెదక్‌లో మెడికల్ కాలేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్న మంత్రి హరీశ్‌రావు
- మెడికల్ కళాశాలకు రూ.180 కోట్లు మంజూరు
- ఎంసీహెచ్ పక్కన పిల్లికోటాల్ సమీపంలో 30 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వం
- అందుబాటులోకి రానున్న కార్పొరేట్ స్థాయి వైద్యం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

# మెడికల్ హబ్‌గా మెదక్

మెదక్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ) : వైద్యరంగ అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తూ విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చింది. సీఎం కేసీఆర్ ప్రజారోగ్యమే లక్ష్యంగా జిల్లాకో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వ దవాఖానల్లో స్థాయిని పెంచడంతో పాటు మాతా శిశు సంరక్షణ కేంద్రా లు, పల్లె, బస్తీ దవాఖానలు, డయాలసిస్ సెంటర్లు, డయోగ్నోస్టిక్ హబ్‌లు, ఐసీయూలతో అందరికీ ఉచితంగా అధునాతన వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చారు. మెదక్ జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాల మంజూరు చేసి ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరికను నెరవేర్చారు. రూ.180 కోట్లతో చేపట్టనున్న మెడికల్ కళాశాల నిర్మాణ పనులకు రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు గురువారం మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేయనున్నారు. జిల్లాలో త్వరలోనే వంద ఎంబీబీఎస్ సీట్ల సామర్థ్యంతో మెడికల్ కాలేజీ అందుబాటులోకి రానుండడంతో జిల్లా వాసుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

### 30 ఎకరాలు.. రూ.180 కోట్లతో..

సీఎం కేసీఆర్ ప్రతి జిల్లాకో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా మెదక్ జిల్లాకు మెడికల్ కాలేజీ మంజూరు చేస్తూ సీఎం కేసీఆర్ ప్రకటన చేశారు. ఇచ్చిన మాట ప్రకారం మంజూరు చేయడంతో పాటు పరిపాలన అనుమతులు ఇచ్చి రూ.180 కోట్లు మంజూరు చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు గురువారం మెదక్ జిల్లా కేంద్రంలోని పిల్లికోటాల్ సమీపంలో నూతనంగా నిర్మించిన మాతా శిశు సంరక్షణ కేంద్రం పక్కన మెడికల్ కాలేజీ నిర్మాణానికి భూమి పూజ చేస్తారు. 30 ఎకరాల విస్తీర్ణంలో రూ.180 కోట్లతో మెడికల్ కాలేజీకి ఏర్పాటు చేస్తున్నారు. ఈ మెడికల్ కాలేజీకి సంబంధించిన అన్ని రకాల మౌలిక వసతులను టీఎస్ఎంఐడీసీ కల్పిస్తున్నది. ఈ నిధులతో 400 పడకల సామర్థ్యంతో దవాఖాన నిర్మాణంతో పాటు ల్యాబ్‌లు, సెమినార్ హాళ్లు, అనుబంధ దవాఖాన భవనాలు, హాస్టల్ భవన నిర్మాణం ఇతర వసతులను కల్పించనున్నారు.

### అందుబాటులోకి కార్పొరేట్ సేవలు..

ప్రభుత్వ దవాఖానలను కార్పొరేట్ స్థాయిలో ఆధునీకరించి పూర్తి స్థాయిలో వైద్యసిబ్బంది, మందులు, సౌకర్యాలు, యంత్ర పరికరాలు ఏర్పాట్లు చేస్తున్నది. ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వ దవాఖానల్లో సౌకర్యాలు, పూర్తి స్థాయిలో వైద్యులు లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్వరాష్ట్రంలో తెలంగాణ ప్రభుత్వం సర్కారు దవాఖానల్లో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పూర్తి స్థాయిలో వసతులను, వైద్యులను నియమించి మెరుగైన వైద్య సేవలందిస్తున్నది. గ్రామీణ ప్రాంత ప్రజలకు కూడా వైద్యసేవలు అందుబాటులోకి తేవాలని ఉద్దేశంతో సీఎం కేసీఆర్ పల్లె దవాఖానల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే మెదక్ జిల్లా కేంద్రంలో 200 పడకల దవాఖాన ఉండగా, మరో 50 పడకల దవాఖానను నిర్మించనున్నారు. మెదక్ మాతా శిశు సంరక్షణ కేంద్రంలో 150 పడకలు ఉండగా, క్రిటికల్ కేర్‌లో మరో 100 పడకల దవాఖాన ఉండాలి. జిల్లా కేంద్రంలోని ఎంసీహెచ్‌లో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు అవసరమైన సౌకర్యాలు, పరికరాలతో పాటు మందులను అందుబాటులో ఉంచుతోంది. కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందుతున్నాయి. ప్రతినెలా 370 వరకు కాన్పులు జరుగుతున్నారు. నవజాత శిశువుల కోసం ఎస్ఎన్‌సీయూ వార్డు ఏర్పాటు చేశారు. ఇందులో ఇంక్యుబేటర్లు, వెంటిలేటర్లు అందబాటులో ఉన్నాయి. మెదక్‌లోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో గర్భిణులు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఇప్పుడు నూతనంగా గర్భిణుల వ్యయ ప్రయాసలకు ఊరట కల్పించేందుకు టిఫ్ఫా స్కానింగ్ యంత్రం ఎంసీహెచ్‌లో ఏర్పాటు చేయడంతో గర్భిణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### ఈ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నం నెరవేరింది..



మెదక్ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నం నెరవేరింది. జిల్లా కేంద్రంలో ఇప్పటికే కార్పొరేట్ స్థాయిలో అన్నివర్గాల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి. ఇప్పటికే జిల్లా కేంద్రంలో సర్కారు దవాఖానల్లో అన్ని సౌకర్యాలతో కూడిన వైద్యసేవలు అందిస్తున్నాం. మాతా శిశు సంరక్షణ కేంద్రంలో మహిళలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి. సీఎం కేసీఆర్ మెదక్‌కు మెడికల్ కాలేజీ మంజూరు చేసి దాని నిర్మాణానికి రూ.180 కోట్లు కేటాయించారు. ఈ ప్రాంత విద్యార్థులు ఒకప్పుడు ఎంబీబీఎస్ చదవాలంటే వేరే జిల్లాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. గురువారం వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు మెడికల్ కాలేజీకి శంకుస్థాపన చేయనున్నారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుకు జిల్లా ప్రజల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నా.

**-ఎం.పద్మాదేవేందర్‌రెడ్డి, మెదక్ ఎమ్మెల్యే**

### నేడు మెదక్‌లో అభివృద్ధి జాతర

మెదక్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ) : మెదక్ జిల్లాలో రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు గురువారం పర్యటించనున్నట్లు మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి తెలిపారు. సుమారు రూ.262 కోట్లతో అభివృద్ధి, శంకుస్థాపనలు చేయనున్నట్టు ఆమె పేర్కొన్నారు. ఇప్పటికే సీఎం కేసీఆర్ మెదక్‌కు మెడికల్ కళాశాల మంజూరు చేసి, దాని నిర్మాణానికి రూ.180 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. మంత్రి హరీశ్‌రావు మెడికల్ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారన్నారు. మెదక్ మున్సిపాలిటీలో వివిధ అభివృద్ధి పనులకు సీఎం ప్రత్యేక నిధి నుంచి రూ.50 కోట్లు, టీయూఎఫ్ఐడీసీ నుంచి రూ.20 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. మెదక్ జిల్లా కేంద్రంలో నూతనంగా రూ.2.50 కోట్లతో నిర్మించిన జిల్లా గ్రంథాలయ భవనాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. మెదక్ పట్టణంలోని దాయర రోడ్డుకు రూ.7.80 కోట్లతో పనులను ప్రారంభిస్తారన్నారు. అర్బన్ పీహెచ్‌సీకి రూ.1.43 కోట్లు, రూ.50 లక్షలతో సఖీ కేం ద్రాన్ని ప్రారంభిస్తారని ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి తెలిపారు. అనంతరం వెల్‌కం బోర్డు చౌరస్తా నుంచి మెదక్ చర్చి ప్రాంగణం వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తామని పేర్కొన్నారు. మెదక్ చర్చి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి హరీశ్‌రావు పాల్గొని ప్రసంగిస్తారని పేర్కొన్నారు. మెదక్ నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులు, కార్యకర్తలు, నాయకులు, ప్రజలు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.


## స్వరాష్ట్రంలో

# గిరిజనులకు పెద్దపీట

**గిరిజనుల ఆత్మగౌరవాన్ని సీఎం కేసీఆర్ పెంచారు**

హుస్నాబాద్, అక్టోబర్ 4: ఆరున్నర దశాబ్దాల కాంగ్రెస్, టీడీపీ పాలనలో గిరిజన తండాలు, గిరిజనుల సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదని, తెలంగాణ వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ నేతృత్వంలో గిరిజనులు ఆత్మగౌరవంతో జీవనం కొనసాగిస్తున్నారని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని గిరిజన బాలికల రెసిడెన్షియల్ స్కూల్, మండలంలోని జిల్లెలగడ్డ గిరిజన బాలుర రెసిడెన్షియల్ స్కూళ్ల ప్రారంభోత్సవం, రూ.5కోట్లతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌తో కలిసి బుధవారం ఆమె శంకుస్థాపన చేశారు. అక్కన్నపేట మండలంలోని పలు గిరిజనతండాల రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన బంజారా ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మాట్లాడారు. గిరిజన తండాల రోడ్ల నిర్మాణానికి సీఎం కేసీఆర్ కోట్లాది రూపాయలు కేటాయించారని, 500 జనాభా కలిగి ప్రతి గిరిజన తండాను గ్రామ పంచాయతీగా మార్చి సొంతంగా పరిపాలన చేసుకునే అవకాశాన్ని కల్పించారన్నారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికీ నీళ్లు వస్తున్నాయని, 24గంటల ఉచిత విద్యుత్‌తో పుష్కలంగా పంటలు పండించుకొని గిరిజనులు ఆర్థికంగా ఎదుగుతున్నారని చెప్పారు. అర్హులైన గిరిజనులందరికీ ఆసరా పింఛన్లు అందుతున్నాయన్నారు. రూ.200 ఉన్న పింఛన్‌ను రూ.2వేలకు పెంచడంతో వృద్ధులు, దివ్యాంగులు ఎవరిపై ఆధారపడకుండా జీవనం సాగిస్తున్నారని, ఇదంతా సీఎం కేసీఆర్ చలవేనన్నారు. ప్రతి గిరిజన తండాకు తారురోడ్ల నిర్మాణం జరిగేలా కృషి చేస్తామన్నారు. అక్కన్నపేటకు కొత్తగా మంజూరైన గిరిజన బాలికల రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణానికి రూ.12కోట్లు మంజూరు చేసేందుకు మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య కోసం ప్రతియేటా రూ.9వేల కోట్లు ఖర్చు చేస్తున్నదన్నారు. తెలంగాణ రాకముందు ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల పాఠశాలలు కేవలం 263 మాత్రమే ఉండేవని, ఇందులో 90వేల మంది విద్యార్థులు మాత్రమే చదివేవారన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత 1,008గురుకుల పాఠశాలలు స్థాపించడం జరిగిందన్నారు. ఇందులో ఏడు లక్షల మంది విద్యార్థులు నాణ్యమైన విద్యను అభ్యసిస్తున్నట్లు చెప్పారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో 98 గిరిజన రెసిడెన్షియల్ పాఠశాల/కళాశాలలు స్థాపించారన్నారు. రైతు బంధు, రైతు బీమా, ఉచిత కరెంట్, రుణ మాఫీతో గిరిజన రైతులు కూడా సంతోషంగా ఉన్నారని, కల్యాణలక్ష్మి పథకం నిరుపేద గిరిజనులకు వరంలా మారిందన్నారు. సీఎం కేసీఆర్ వచ్చిన తర్వాతే సేలాలాల్ మహరాజ్ జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నారని, హుస్నాబాద్‌లో త్వరలోనే సేవాలాల్ దేవాలయం నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. ఎన్నికలప్పుడే తండాలకు వచ్చి మాయమాటలు చెప్పే కాంగ్రెస్, బీజేపీ నాయకులను నమ్మొద్దని సూచించారు. కాంగ్రెస్ పాలనలోని కర్ణాటక, రాజస్థాన్‌లో అమలు చేయని పథకాలను ఇక్కడ అమలు చేస్తామని గ్యారంటీల పేరుతో వస్తున్న కాంగ్రెస్ నేతల మాటలు వట్టి బూటకమన్నారు. మూడోసారి సీఎంగా కేసీఆర్, హుస్నాబాద్ ఎమ్మెల్యేగా సతీశ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించడంలో గిరిజనులందరూ భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు.

- 2014కు ముందు నిరాదరణకు గురైన తండాలు
- సీఎం కేసీఆర్ విజన్‌తో రెసిడెన్షియల్ స్కూళ్లు
- మోసపూరిత మాటలు చెప్పే కాంగ్రెస్, బీజేపీ వాళ్లను నమ్మొద్దు
- మూడోసారి సీఎంగా కేసీఆర్, హుస్నాబాద్ ఎమ్మెల్యేగా సతీశ్‌కుమార్‌ను గెలిపించుకోవాలి
- మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్
- హుస్నాబాద్ నియోజకవర్గంలో రూ.51కోట్లతో గిరిజన తండాలకు రోడ్లు
- హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్



అక్కన్నపేటలో గిరిజన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి సత్యవతిరాథోడ్



అక్కన్నపేటలో మంత్రిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే సతీశ్ కుమార్



హుస్నాబాద్‌లో తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలను ప్రారంభిస్తున్న మంత్రి సత్యవతిరాథోడ్, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్



అక్కన్నపేటలో గిరిజన ఆత్మీయ సమ్మేళనానికి భారీగా హాజరైన మహిళలు



చిన్నారులతో మంత్రి సత్యవతిరాథోడ్



హుస్నాబాద్ మండలం జిల్లెలగడ్డలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి సత్యవతిరాథోడ్

### గిరిజన తండాల్లో రోడ్లు, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

హుస్నాబాద్ నియోజకవర్గంలోని గిరిజన తండాల్లో రోడ్లు, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ తెలిపారు. నియోజకవర్గంలోని 54తండాల్లో పలు తండాలకు రూ.51కోట్లతో తారురోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. ఇంకా కొన్ని తండాలకు త్వరలోనే రోడ్లు వేయిస్తామని చెప్పారు. నియోజకవర్గంలోని 15 తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిదంన్నారు. దీంతో గిరిజనులే తమ తండాలను పాలించుకునే అవకాశం వచ్చిందన్నారు. నియోజకవర్గ కేంద్రమైన హుస్నాబాద్‌లో రూ.3కోట్లతో బంజారా భవన్ నిర్మాణం కూడా పూర్తి కాబోతున్నట్లు వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి పనులతో గిరిజన తండాల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని, ఇంకా అభివృద్ధి జరగాల్సిన అవసరం ఉందన్నారు. హుస్నాబాద్‌లో బాలురు, బాలికల గిరిజన రెసిడెన్షియల్ స్కూళ్లు, రెండు కస్తూర్బా పాఠశాలలు, మరో రెండు గిరిజన ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయన్నారు. రెసిడెన్షియల్ స్కూళ్లల్లో ఒక్కో విద్యార్థికి ఏటా రూ.1.25లక్షలు ప్రభుత్వం ఖర్చు చేస్తున్నదని గుర్తు చేశారు. అక్కన్నపేట మండలానికి మంజూరైన గిరిజన బాలికల రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణానికి త్వరలోనే ఏడు ఎకరాల స్థలాన్ని కేటాయిస్తామని హామీ ఇచ్చారు. గిరిజనుల ఆత్మగౌరవాన్ని పెంచే విధంగా కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌ను మరోసారి ఆశీర్వదించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతిపక్ష నాయకులు తండాలకు వచ్చి అసత్య ప్రచారం చేస్తుంటారని, వారి ప్రచారాన్ని తిప్పికొట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో హనుమకొండ జిల్లా పరిషత్ చైర్మన్ డాక్టర్ సుధీర్‌కుమార్, సిద్దిపేట జడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, ఎంపీపీలు మాలోతు లక్ష్మీబీలూనాయక్, కొక్కుల కీర్తి సురేశ్, జక్కుల అనితరమేశ్, జడ్పీటీసీలు భూక్యా మంగశ్రీనివాస్, వంగ రవీందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎడబోయిన రజనీతిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు వంగ వెంకట్రామ్‌రెడ్డి, పెసరు సాంబరాజు, బీలూనాయక్, రామచంద్రంనాయక్, కాసర్ల అశోక్‌బాబు, లింగాల సాయన్న, పరశురామ్, తిరుపతినాయక్, రమేశ్‌నాయక్, కందుల రాంరెడ్డి, సత్యంనాయక్, పలు గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీలు,గిరిజనులు పాల్గొన్నారు.



హుస్నాబాద్ మండలం జిల్లెలగడ్డలో నృత్యాలు చేస్తున్న గిరిజన మహిళలు

## పనిచేసే ప్రభుత్వానికి

# అండగా నిలవాలి

- చేసిన అభివృద్ధి, సంక్షేమ పాలన గురించి ప్రజలకు వివరించాలి
- అన్నివర్గాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి
- అసత్య ప్రచారాన్ని దీటుగా తిప్పికొట్టాలి
- బూత్ స్థాయి నుంచి భారీ మెజార్టీ రావాలి
- ముఖ్యకార్యకర్తల సమావేశంలో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

చేగుంట, అక్టోబర్ 4: బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పాలన గురించి ప్రజలకు వివరించి మరోసారి గెలిపించేలా కార్యకర్తలు కృషిచేయాలని మెదక్ ఎంపీ కొత్త ప్రబాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మెదక్ జిల్లా చేగుంట మండల కేంద్రంలోని సాయిబాలాజీ గార్డెన్‌లో బుధవారం జరిగిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాల వారికి న్యాయం చేస్తున్నట్లు చెప్పారు. రైతుల కోసం రైతుబంధు,రైతుబీమా, దండిగా ఎరువులు, విత్తనాలు, 24గంటల ఉచిత విద్యుత్, ప్రాజెక్టులు నిర్మించి కాలువల ద్వారా సాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు. ముదిరాజ్ కులస్తుల అభివృద్ధికి చెరువుల్లో వంద శాతం సబ్సిడీపై ప్రభుత్వం చేపలు వదులుతూ జీవనోపాధి చూపుతుదన్నారు. సబ్సిడీపై వాహనాలు అందజేస్తుట్లు తెలిపారు. చేనేత,గీత కార్మికుల,బీడీ కార్మికులకు పింఛన్ ఇస్తున్నామని, పేద ఆడబిడ్డల పెండ్లికి కల్యాణలక్ష్మి పథకం ద్వారా రూ.లక్షా 116 అమ్మాయి తల్లికి అందజేస్తున్నట్లు చెప్పారు. దళిత బంధు పథకం ద్వారా ఒకో కుటుంబానికి ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు 10లక్షల రూపాయలు అందజేస్తుదన్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నదని తెలిపారు.

ఇలా చెప్పుకుంటూ పోతుంటే అనేక సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని నంబర్‌వన్ స్థానంలో నిలబెట్టిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దే అన్నారు. మూడోసారి తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, ప్రతి కార్యకర్త పార్టీకోసం కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పాలన గురించి ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. మండల బూత్ సమన్వయ కమిటీలతో పాటు అన్ని గ్రామాల్లో బూత్ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అధిక మెజార్టీ తీసుకువచ్చే బూత్ కమిటీ సభ్యులకు తగిన గౌరవం ఉంటుందని, పార్టీ తరపున అన్ని విధాలా వారికి సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రతిపక్షాల అసత్య ప్రచారాన్ని దీటుగా తిప్పికొట్టాలని, ఈ తొమ్మిదేండ బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి గురించి విస్తృతంగా ప్రజల ముందు ఉంచాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మనోహర్‌రావు, చక్ర నర్సింహరెడ్డి, చేగుంట ఎంపీపీ మాసుల శ్రీనివాస్, జడ్పీటీసీలు ముదాం శ్రీనివాస్, బాణపురం కృష్ణారెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మంచికట్ల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రజనక్ ప్రవీణ్‌కుమార్, సొసైటీ చైర్మన్ వంటరి కొండల్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకులు రంగాయ్యగారి రాజిరెడ్డి, తానీషా, ఎర్ర యాదగిరి, మైలరాం రాంచంద్రం, జీవన్‌రెడ్డి, వేణుగోపాల్‌శర్మ, సర్పంచులు బుడ్డ స్వర్ణలతబాగ్యరాజ్, రాములు, సంతోష్‌రెడ్డి, కొటారి అశోక్, కుమ్మరి శ్రీనివాస్, ఊరడి మహిపాల్, కాశబోయిన భాస్కర్, ఎంపీటీసీలు అయితే వెంకటలక్ష్మీరఘురాములు, గాండ్ల లతనంధం, బక్కి లక్ష్మీరమేశ్, నవీన్, గణేశ్, శ్రీను, నాయకులు వడ్డెపల్లి నర్సింహులు, వంటరి అశోక్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, కనుగంటి లచ్చయ్య, బాల్‌శివ, బాపురెడ్డి, బండి విశ్వేశ్వర్, యాదిరెడ్డి, మోహన్‌రెడ్డి, గుల్ల సిద్దిరాములు, నాగరాజు, క్రాంతి, మైనార్టీ నాయకులు మమ్మద్ అలీ, నదీం, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



చేగుంటలో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశానికి హాజరైన నాయకులు,కార్యకర్తలు